

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | పేజీలు : 04





# హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

**ఒకొక్కరికి 20వేలు జరిమానా - హత్య చేసేటపుడు ముద్దాయిలే వీడియో తీసి వైరల్ చేశారు**
**- ఆ వీడియోలే ముద్దాయిల పాలిట శాపంగా మారాయి.**
**- ప్రధాన సాక్షులు రాజీ అయినప్పటికీ, అధికారుల మరియు వీడియో సాక్షాల ఆధారంగా నేరం ఋజువు**
**- సంచలన తీర్పు వెలువరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్**
**- ప్రాసిక్యూషన్ తరపున బలమైన వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాచమల్లు హరినాథ్‌రెడ్డి**

**అనంతపురం, ఫిబ్రవరి 24, (ప్రభాతవార్త బ్యూరో)**
అనంతపురం జిల్లా నార్పలకు చెందిన మట్టి పవన్ కుమార్ హత్య కేసులో ఐదుగురికి జీవిత కాలపు కఠిన కారాగార శిక్ష విధిస్తూ అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సోమవారం సంచలన తీర్పు చెప్పారు. కేసు పూర్వాపరాల్లోకి వెళితే, నార్పలకు చెందిన హతుడు మట్టి పవన్ కుమార్, మొదటి ముద్దాయి డిపో షాజిద్ మంచి స్నేహితులు. వారి మధ్య భేదాభిప్రాయాలు వచ్చి కొట్లాడుకుంటూ, తరువాత మట్టి పవన్ కుమార్ ఈ డిపో షాజిద్‌ను, నల్గవ ముద్దాయి తలారి సుధాకర్‌ను చంపుతానని బెదిరించేవాడు. వారి మధ్య భేదాభిప్రాయాలు తారాస్థాయికి చేరడంతో మట్టి పవన్‌కుమార్ తన తల్లిదండ్రులతోపాటు సంసారాన్ని నార్పల నుండి అనంతపురం కు మార్చారు. 2022 సంవత్సరం ఏప్రిల్ 12 తేదీ తేదీ మట్టి పవన్ కుమార్ అతని తండ్రి మట్టి శ్రీనివాసులు రేషన్ బియ్యం తెచ్చుకోవడం కోసం నార్పలకు వెళ్లారు. మధ్యాహ్నం తండ్రికి చెప్పకుండా మట్టి పవన్ కుమార్ నార్పల తహసీల్దార్ ఆఫీస్ వద్దకు పోయాడు. అక్కడ డిపో షాజిద్ తారస పడడంతో ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఆ క్రమంలో మట్టి పవన్ కుమార్ డిపో షాజిద్ పై కత్తితో దాడి చేయగా, అతని వేలికి గాయాలయ్యాయి. ఆ తర్వాత అదే రోజు రాత్రి డిపో షాజిద్ తన అనుచరులైన చింతాకు రమేష్, చిక్కేపల్లి నాగేంద్ర, తలారి సుధాకర్, మరియు తలారి అరుణ్‌లను వెంట పెట్టుకొని మట్టి పవన్ కుమార్ కోసం వెతుకుతూ వుండగా, రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో నార్పల గ్రామంలోని వడ్డే తిమ్మప్ప తోట వద్ద మట్టి పవన్ కుమార్ వున్నాడన్న సమాచారం తెలుసుకొని పై వారందరూ స్టీల్ రాడ్, రెండు కట్టెలు తీసుకొని అక్కడికి పోయి, డిపో షాజిద్ ఏమిరా నీవు మధ్యాహ్నం నాతో గొడవపడి నన్నే కొట్టడానికి వస్తావా నిన్ను చంపితే నీకు దిక్కెవరు అంటూ డిపో షాజిద్, తలారి సుధాకర్, తలారి అరుణ్ తమ వెంట తెచ్చుకొన్న స్టీల్ రాడ్, కట్టెలతో అతి దారుణంగా కొడుతూ, కొట్టేటప్పుడు తలారి సుధాకర్, చిక్కేపల్లి నాగేంద్రను వీడియో తీయమని ఆదేశిస్తూ, ఈ వీడియో చూసి అందరూ మనమంటే భయపడాలి అని చెప్పగా నాగేంద్ర తన సెల్ నుండి మట్టి పవన్ కుమార్‌ను చంపేటప్పుడు వీడియో తీసి, దానిని తలారి సుధాకర్ సెల్‌కు ఫార్వర్డ్ చేశాడు. అందులో సుధాకర్ అంటే ఒక బ్రాండ్ అంటూ రాడ్ తో ఇష్టానుసారంగా కొట్టే దృశ్యాలు వున్నాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ చేసింది. పోలీసులు నాగేంద్ర మరియు తలారి సుధాకర్ సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి, అందుకు సంబంధించిన బలమైన డిజిటల్ సాక్ష్యాలను కోర్టు ముందు ప్రవేశపెట్టడం వలన, ప్రత్యక్ష సాక్షులు సాక్ష్యం చెప్పక పోయినప్పటికీ, సెల్‌ఫోన్ లో నిక్షిప్తమైన వీడియోతో పాటు అధికారులు చెప్పిన సాక్ష్యాల ఆధారంగా నేరం ఋజువు కావడంతో ముద్దాయిలు డిపో షాజిద్, చింతాకు రమేష్, చిక్కేపల్లి నాగేంద్ర, తలారి సుధాకర్, తలారి అరుణ్‌లకు జీవిత కాలపు కఠిన కారాగార శిక్ష విధిస్తూ,ఒక్కొక్కరికి 20,000/ జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున రాచమల్లు హరినాథ్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. ఈ కేసులోని ముద్దాయిలు అందరూ 25 సంవత్సరాల లోపు యువ కులు, ఒక్కరు మినహా అందరూ అవివాహితులు. ఈ కేసులో అప్పటి నార్పల ఎస్సై యు.వెంకట ప్రసాద్, సెక్షన్ 302 ఆర్ / డబ్ల్యు సెక్షన్ 34 ఐపీసీ క్రింద ఎఫ్ఐఆర్ నెంబర్ 57/2022 గా నమోదు చేయగా, అప్పటి ఇటుకల పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్లు శ్రీ. విజయ భాస్కర్ గౌడ్, శ్రీ.అస్రార్ బాషా, సమగ్ర దర్యాప్తు జరిపి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను తీసుకు రావ డంలో ఎస్ఐ మల్లిరెడ్డి, కానిస్టేబుళ్ళు రామమోహన్, షానవాజ్ బాగా సహకరించారు. వీరందరిని అనంతపురం జిల్లా ఎస్పీ పి .జగదీష్ అభినందించారు.



తమకు న్యాయం జరిగిందంటూ మీడియాతో మాట్లాడుతున్న పవన్ కుమార్ తల్లిదండ్రులు

**ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌తో**

# ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి నేతలలో పెరిగిన ఆశలు

- పరిశీలనలో గుండుమల తిప్పేస్వామి, పరిటాల శ్రీరామ్, ప్రభాకర్ చౌదరి,
- మార్చి మూడున ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ - మార్చి 20న ఎన్నికలు
- ఆంధ్రాలో 5, తెలంగాణలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు







**అనంతపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త బ్యూరో**
ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ సోమవారం రావడంతో అధికార తెలుగుదేశం పార్టీ నేతల్లో చర్చనీయాంశమైంది. మార్చి మూడో తేదీన ఎన్నికల నోటిఫికే షన్ వెలువడుతోంది.. ఆంధ్రాలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు, తెలంగాణలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ వస్తోంది.. మార్చి పదో తేదీ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీగా, మార్చి 20 తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇక ఎమ్మెల్సీ ఎన్నికల కోలాహరం ఇటు తెలుగుదేశం, అటు జనసేనలో ఉండే అవకాశం ఉంది. రాష్ట్రంలో మెజారిటీ ఎమ్మెల్యేలు టిడిపి, జనసేన, బిజెపి కూటమీ వారే ఉండడంతో ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవం అయ్యే అవకాశం మెండుగా ఉన్నాయి. అందులో భాగంగా ఆంధ్రాలో ఎమ్మెల్సీగా ఉన్న జంగా కృష్ణమూర్తి 2024 సంవత్సరం మే 15 తేదీన గడువు పూర్తయింది. ఎమ్మెల్సీలుగా ఉన్న దువ్వారపు రామారావు, పరుచూరి అశోక్ బాబు, బి తిరుమల నాయుడు, యనమల రామకృష్ణుడు ల గడువు ఈ ఏడాది మార్చి 29వ తేదీకి పూర్తి అవుతుంది.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఖాళీ పడే ఎమ్మెల్సీ స్థానాలకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఎక్కువ మంది ఆశిస్తున్నారు.

ప్రధానంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి.. మరో ఇద్దరు, ముగ్గురు నాయకులు ఆశిస్తున్నప్పటికీ జిల్లాలో ఈ ముగ్గురు పేర్లు టిడిపి వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయని చెప్పచ్చు. వీరిలో ఎవరు చేయించుకుంటారు అన్నది హాట్ టాపిక్ గా ఉంది.. హిందూపురం పార్లమెంట్ పరిధిలో మంచి పట్టున్న నాయకుడు మడకశిర నియోజకవర్గ టిడిపి,ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఒకరు. 2019, 2024 ఎన్నికల్లో పార్లమెంటు ఎంపీ స్థానాన్ని ఆశించిన రెండుసార్లు కూడా పార్టీ అధినాయకత్వం ఇతరులకు కేటాయించడంతో నిరాశ చెందక పార్టీ బలోపేతానికి కృషి చేశారు అని అభిప్రాయం ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు టిడిపి తరఫున జిల్లా స్థాయి శతజయంతి వేడుకలను మడకశిర నియోజకవర్గంలో ఏర్పాటు చేసి జిల్లా స్థాయి ముఖ్య నేతలను ఆహ్వానించి విజయవంతం చేశారు అని టిడిపి మద్దతుదారులు చెబుతుంటారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 15 రోజుల వ్యవధిలో తెలుగుదేశం పార్టీ కొత్త ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెస్ రాజును పార్టీ నాయకత్వం రంగంలోకి దింపినప్పటికీ గెలిపించుకునే బాధ్యతను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ,లోకేష్ లు బాధ్యతలు అప్పగించారు. ఆ సమయంలో వైకాపా పార్టీ నాయకులు అభ్యర్థి మార్పుతో అనేక విమర్శలు చేసినప్పటికీ మాజీ ఎమ్మెల్సీ తన రాజకీయ చతురతతో ఏమ్మెస్ రాజు వాగ్దాటితో నియోజకవర్గంలో కేవలం ముఖ్యమైన ప్రదేశంలో మాత్రమే ప్రచారాన్ని నిర్వహించి పూర్తి బాధ్యతను తన అనుచరులకు అప్పగించి ప్రచారం చేపట్టారు. మడకశిర ప్రజలు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెస్ రాజుకే పట్టం కట్టారు. గుండుమల తిప్పేస్వామి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లా పరిషత్ చైర్మన్ గా ఎమ్మెల్సీగా రెండుసార్లు, బీసీ కమిటీ చైర్మన్ గా పనిచేసే ఆ పార్టీలో ఓ వెలుగు వెలిగారు. అనంతరం తెలుగుదేశం పార్టీలోకి చేరి ఓసారి ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం గుండుమల తిప్పేస్వామి ఎమ్మెల్సీ స్థానాన్ని ఆశిస్తున్నాడు.. ఇదే సమయంలో టిడిపి సీనియర్ నాయకుడు, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఎమ్మెల్సీ స్థానం కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కర్నూలు జిల్లా పార్టీ పరిశీలకుడి గా పనిచేసి పలు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి నీ మెరుగుపరిచేందుకు, గత ఎన్నికల్లో ఎప్పుడు సీట్లు సాధించేందుకు తగిన చేశాడని అభిప్రాయం ఉంది. గత ఎన్నికల్లో అనంతపురం అర్బన్ సీటు ఆశించి నిరాశకు గురయ్యారు. చివరి నిమిషంలో దగ్గుబాటి ప్రసాద్ అనంతపురం అర్బన్ టిక్కెట్ చేజిక్కించుకొని టిడిపి, జనసేన, బిజెపి కూటమి హవాలో గెలిచిపోయిన విషయం తెలిసిందే.. వైకుంఠం ప్రభాకర్ చౌదరి గతంలో కాంగ్రెస్ పార్టీలో ఎక్కువ కాలం పని చేసి తనదైన శైలిలో రాజకీయాలు నడిపాడు. ఆయన తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన తర్వాత అనంతపురం మున్సిపల్ చైర్మన్ గా పనిచేసి తనదైన మార్క్ చూపించాడు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ స్థానం విషయంలో ప్రభాక చౌదరి పేరు కూడా బలంగా వినిపిస్తోంది.. ఇదే సమయంలో టిడిపి నేత, దివంగత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కుమారుడు పరిటాల శ్రీరామ్ ప్రస్తుతం ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జిగా ఉన్నారు.. 2019 ఎన్నికల్లో రాప్తాడు నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో ధర్మవరం నియోజకవర్గ టికెట్ను టిడిపి తరఫున పరిటాల శ్రీరామ్, బిజెపి తరఫున మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆశించారు. నువ్వా నేనా అన్న రీతిలో గోనుగుంట్ల సూర్యనారాయణ, పరిటాల శ్రీరామ్ ధర్మవరం టికెట్ కోసం గత ఎన్నికల్లో ప్రయత్నం చేశారు.. ఎవరు ఊహించిన విధంగా ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా ఉన్న సత్య కుమార్ యాదవ్ బిజెపి తరఫున ధర్మవరం టికెట్ తెచ్చుకొని కూటమి అభ్యర్థిగా గెలుపొందిని విషయం తెలిసిందే.. సత్య కుమార్ యాదవ్ గెలుపు కోసం పరిటాల శ్రీరామ్ గట్టిగానే పనిచేశాడు. ప్రస్తుతం ఎమ్మెల్సీ స్థానం తనకి ఇవ్వాలని పరిటాల శ్రీరామ్ గట్టిగా పట్టుబడుతున్నట్టు టిడిపి సర్కిల్లో చర్చగా ఉంది.. ఈ విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలువురు టిడిపి నేతలు ఎమ్మెల్సీ స్థానాల కోసం గంపడాశలు పెట్టుకున్నారు.. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్ బాబు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

# మా రైతుల బాధలు, అభ్యంతరాలు పరిగణలోకి తీసుకోండి

**- జలవనురుల శాఖ మంత్రికి ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి**
**- హంద్రీనీవా పరిధిలో భూగర్భ జలాలు అడుగంటకుండా, చెరువులకు నీరు అందించాలి**

**అనంతపురం, ఫిబ్రవరి 24, (ప్రభాతవార్త బ్యూరో)**
హంద్రీనీవా కాలువ 2వదశ కాల్వ లైనింగ్ పనులకు సంబంధించి మా రైతుల అభ్యంతరాలు, ఇబ్బందులను పరిశీలించాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆమె మంత్రి క్యాంప్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ నియోజకవర్గంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాస్తవంగా శనివారం రోజు రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ పరివాహక ప్రాంత రైతులతో ఎమ్మెల్యే సునీత, పరిటాల శ్రీరామ్ సమావేశమయ్యారు. హంద్రీనీవా అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ ప్రాంతానికి ఎదురయ్యే కష్టాల గురించి వివరించారు. లైనింగ్ పనులు చేస్తే తమ ప్రాంతంలో ఉన్న చెరువులకు నీరందే అవకాశం లేదని, భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా చేసేందుకు కొన్ని ప్రతిపాదనలు కూడా చేశారు. కాలువ వెంబడి గల వివిధ చెరువులు, కుంటలను హంద్రీనీవా నీరు అందేలా.. తూములను ఏర్పాటు చేయటం, కాలువ సమీపంలో వంకలపై గల చెక్ డ్యామ్ లకు నీరు అందించే విధంగా తూములు ఉండాలని, కాలువ ఉన్న ప్రాంతంలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు కాలువను దాటే విధంగా వంతెనలు నిర్మించాలని తమ అభిప్రాయాలను రైతులు చెప్పారు. రైతులు చెప్పిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సోమవారం మంత్రి నిమ్మల రామానాయుడు గారిని కలిసి.. రైతులు ప్రతిపాదించిన అన్ని అంశాల గురించి వివరించారు. తీవ్ర కరవు ప్రాంతమైన రాప్తాడు నియోజకవర్గంలో గతంలో నీరు లేక వలసలు ఉండేవన్నారు. హంద్రీనీవా నీరు వచ్చిన తర్వాత తిరిగి ఈ ప్రాంతం వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. హంద్రీ నీవా కాలువ వెంబడి 38 చెరువులకు నీరు ఆగితే చాలా నష్టపోతారన్నారు. అన్ని చెరువులకు నీరందడంతోపాటు భూగర్భ జలాలు తగ్గకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి రామానాయుడు స్పందిస్తూ కచ్చితంగా రైతులు చెప్పిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు...జీడిపల్లి పేరూరు ప్రాజెక్ట్ కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వండి..జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్ట్ కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే సునీత మంత్రి రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. 2018లో అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు మీద నమ్మకంతో భూములిచ్చిన రైతుల్లో చాలా మందికి ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. యూపీపీ కాలువకు సంబంధించి భూసేకరణకు మొత్తం రూ.50.00 కోట్లకు గాను రూ.4.86 కోట్లు గతంలో చెల్లించారన్నారు. ప్రస్తుతం రూ.14.50 కోట్లకు సీఎఫ్ఎంఎస్ ద్వారా భూసేకరణ చెల్లింపుల కోసం బిల్లులు అప్లోడ్ చేశారన్నారు. వెంటనే ఈ రూ.14.50 కోట్ల నిధులు విడుదల చేసి రైతులకు ఇవ్వడంతో పాటు ప్రాజెక్ట్ పనులకు కూడా నిదులు మంజూరుచేసి పనులను పునః ప్రారంభించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు. ఇటీవల భారీ వర్షాలకు తెగిపోయిన కనగానపల్లి చెరువు మరమ్మతుకు, నడిమివంక రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి రామానాయుడు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతులకు పరిహారం చెల్లించేలా వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం పరిటాల కుటుంబం ఎంతో కోల్పోయిందని.. ఇప్పుడు అదే ప్రజల కోసం విజ్ఞప్తి చేస్తున్నారని.. వారి నుంచి వచ్చే ఏ అంశమైనా సరే వెంటనే స్పందించాలని అధికారులకు ఆదేశించారు. రైతులకు పరిహారం ఇవ్వడంతో పాటు పనులు కూడా ప్రారంభమయ్యేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

# నీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రులతో భేటి

**మడకశిర టౌన్ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త,**
రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రివర్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మడకశిర నియోజకవర్గంలో నీటిపారుదల, తాగునీటికి సంబంధించిన పలు అంశాలను మంత్రులతో వారు చర్చించారు. నియోజవర్గంలో పెండింగ్ లో ఉన్నటువంటి పలు నీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మడకశిర నియోజకవర్గం లో అవసరమైన పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రితో చర్చించారు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు . ఇరువురు మంత్రులు దీనిపై సానుకూలంగా స్పందించరని ఎమ్మెల్యే రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు,





నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రవాణా క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌లతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# చంద్రబాబు నిర్ణయం పేదల వైద్యం గగనం

**- విభజన హామీలను రాబట్టడంలో కూటమి నేతల వైఫల్యం - మాజీ మంత్రి సాకే శైలజానాథ్**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

**అనంతపురం సిటీ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**
ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసే దిశగా సిఎంచంద్రబాబునాయుడు చేస్తున్న ప్రయత్నాలతో పేదలకు వైద్య విద్యతోపాటు వైద్యం గగనమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ విమర్శించారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో మాజీ ఎంపి తలారి రంగయ్యతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు విద్య, వైద్యం ఎంతో ముఖ్యమన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్యానికి ప్రాధాన్యత తగ్గిస్తుండటంతో విద్య, వైద్యం అత్యంత ప్రమాదంలో ఉన్నాయన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో 15 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చి పేద వారికి నాణ్యమైన వైద్యాన్ని అందించడంతోపాటు పేద విద్యార్థులకు వైద్య విద్యనుచేరువ చేసే దిశగా కృషి చేశారన్నారు. ఇందులో కొన్ని కళాశాలలు దాదాపు వినియోగంలోకి తీసుకొచ్చే స్థాయికి పూర్తి చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు వాటిని ప్రైవేట్ రంగానికి అందించే దిశగా చర్యలు చేపడుతుండటం దురదృష్టకరమన్నారు. వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, ఆరోగ్యశ్రీని లేకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆధీనంలో వైద్య రంగం ఉంటేనే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, ప్రైవేట్‌పరం చేస్తే పేదలకు వైద్యం అందుతుందా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేత అసెంబ్లీ సమావేశాల్లో చంద్రబాబునాయుడు అసత్యాలు మాట్లాడించారని, ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చేతులెత్తేసిందన్నారు. అంతేకాకుండా కేంద్రం నుంచి విభజన హామీలలో భాగంగా రావాల్సిన రూ.28వేలకోట్ల నిధులను రాబట్టడంలో కూటమి నేతలు ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మాజీ ఎంపి తలారి రంగయ్య మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన నవరత్నాలు హామీలను 99 శాతం పైగా అమలు చేసి ప్రతి ఇంటికి లబ్ది చేకూర్చారన్నారు. అయితే కూటమి నేతలు ఎన్నికల సమయంలో నవరత్నాలు 9 అయితే సూపర్ సిక్స్‌లో ఆరు పథకాలే అందిస్తామని హామీ ఇచ్చి 9 నెలల పాలనలో ఏ ఒక్కటి అమలు చేయలేకపోయారని విమర్శించారు. పింఛన్ల పెంపు సూపర్ సిక్స్‌లో భాగం కాదని ఆయన పేర్కొన్నారు. కరోనా వంటి విపత్తు ఎదరైనా నవరత్నాలతోపాటు చెప్పని అనేక హామీలను నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించారు తప్పా చంద్రబాబులా బీద అరుపులు అరవలేదన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబుతోపాటు ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు నారాలోకేష్, బావమరిది బాలకృష్ణలు సూపర్ సిక్స్ హామీలతోపాటు సెల్ఫీలు తీసుకుని తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్‌తోపాటు అభివృద్ధి చేస్తామని హామీలను అమలు చేస్తామని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్రశేఖర్‌తోపాటు పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

# ఔషధ నియంత్రణ శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత

**- తీవ్ర పని భారంతో ఒత్తిడిలో అధికారులు**



అనంతపురం జిల్లా కేంద్రంలోని ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయం

**అనంతపురం వైద్యం ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**
నిషి ఆరోగ్య రక్షణలో ఔషధాల (మందులు)పాత్ర చాలా కీలకం. అలాంటి ఔషధాల (మందులు) షాపుల ఏర్పాటు, నకిలీ మందుల నివారణ చేసే ఔషధ నియంత్రణ శాఖలో సిబ్బంది కొరత తీవ్రవంగా వేధిస్తోంది. అనంతపురం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2300 పైచిలుకు మెడికల్ షాపులు ,ఏజెన్సీలు ఉన్నాయి వీటిని నియంత్రించే బాధ్యత కేవలం ఇద్దరు అధికారులు మాత్రమే చూస్తున్నారు. ఔషధ నియంత్రణ శాఖ జిల్లా అధికారితో పాటు నలుగురు డ్రగ్ ఇన్స్పెక్టర్లు ఉండాల్సి ఉండగా ఇప్పుడు ఔషధ నియంత్రణ జిల్లా అధికారి, ఒక డ్రగ్ ఇన్స్పెక్టర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరు జిల్లా ఔషధ నియంత్రణ అధికారి విధులతో పాటు అనంతపురం జోన్ 2(తాడిపత్రి) , కదిరి డ్రగ్ ఇన్స్పెక్టర్ గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తూన్నారు. ఇదే కార్యాలయంలో డ్రగ్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న మరో అధికారి అనంతపురం తో పాటు హిందూపురం డ్రగ్ ఇన్స్పెక్టర్ గాఅదనపు బాధ్యతలు వహిస్తున్నారు. నకిలీ మందుల నివారణ, అనధికార షాపుల ఏర్పాటు గుర్తించడం తోపాటు వివిధ రకాల విధులను వీరు నిర్వహించాల్సి ఉంటుంది. ఆధికారులతో పాటు జూనియర్ అసిస్టెంట్ ,ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఒక ఆఫీసు అసిస్టెంట్ ఉండాల్సిన చోట కేవలం ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఒక ఆఫీస్ అసిస్టెంట్ తో కార్యాలయాన్ని నెట్టుకొస్తున్నారు. ఇరు జిల్లాల కలెక్టర్లు సమీక్ష సమావేశాలు, కోర్టు కేసులు, విజిలెన్స్ అధికారులతో కలిసి తనిఖీలు లాంటి పనులతో తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నారు.అననిత్యం పని ఒత్తిడిలో నలుగుతూ ఆరోగ్యాన్ని సైతం కోల్పోతున్నారు. సుమారు ఐదు సంవత్సరాలుగా ఔషధ నియంత్రణ శాఖకు ఉద్యోగులను కేటాయించడం లేదు ఉన్నవారితోనే అదనపు బాధ్యతలను అప్పజెప్పితూ రాష్ట్ర స్థాయి అధికారులు పని గడుపుకుంటున్నారు. కార్యాలయానికి అదనపు సిబ్బంది కావాలి అంటూ పలుమార్లు రాష్ట్ర కార్యాలయానికి విన్నవించినప్పటికీ నియమించలేదని సమాచారం.

**సిబ్బంది నియామకం గురించి ఉన్నతాధికారులకు నివేదించాం**
**రమేష్‌రెడ్డి,**
**జిల్లా ఔషధ నియంత్రణ అధికారి**



అనంతపురం ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఔషధ నియంత్రణ శాఖలో సిబ్బంది కొరత వాస్తవమే మా కార్యాలయానికి మరింత మంది సిబ్బంది అవసరం అంటూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం వారి నుంచి సానుకూల స్పందన కోసం ఎదురు చూస్తున్నాం.

# బిల్డింగ్ లో నవీద్ ఘనత

## నాలుగు మెడల్స్ ప్రధానం



పురస్కారాన్ని అందుకుంటున్న నవీద్ బాడీ

**హిందూపురం ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

చెన్నైలో జరిగిన జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో హిందూపురానికి చెందిన జిమ్ నిర్వాహకులు షఫీ కుమారుడు నవీద్ సత్తా చాటి నాలుగు పథకాలు సాధించాడు. వరల్డ్ ఫిట్నెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఓపెన్ బాడీ బిల్డింగ్ కాంపిటీషన్ ఆదివారం చెన్నై కేంద్రంగా నిర్వహించగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది బాడీ బిల్డర్లు హాజరయ్యారు. జూనియర్ మెన్స్ ఫిజిక్ కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. అదేవిధంగా సీనియర్ బాడీ బిల్డింగ్ విభాగంలో రజత పథకం, జూనియర్ బాడీ బిల్డింగ్ కేటగిరీలో రజతం, క్లాసిక్ ఫిజిక్ కేటగిరీలో నాలుగో స్థానం లో నిలిచారు. హిందూపురానికి చెందిన యువకుడు బాడీ బిల్డింగ్ విభాగాల్లో ఈ ఘనత సాధించడంపై పలువురు అభినందించారు.

# పాము కాటుతో రైతు మృతి

**బ్రహ్మసముద్రం.ఫిబ్రవరి.24. ప్రభాతవార్త**



నివాళులు అర్పిస్తున్న వైసిపి నాయకులు

మండల పరిధిలోని వేపలపర్తి గ్రామ కురుబ గురుస్వామి 55.పాము కాటు మృతి చెందాడు. మృతుడు శనివారం రాత్రి వ్యవసాయ పొలంలో పొలంనకు బిటిపి నీరు పెట్టడానికి వెళ్లిన రైతును పొలం గట్టుపై పాము కాటు వేయడం తో కొద్దినిముషాలలోనే నోటిగుండ నురుగు రావడంతో హుటాహుటిన రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాలకు కారులో తీసుకెళ్లగా మార్గ మధ్యంలో లోనే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు.మృతునికి భార్య ఒక కూతురు కుమారుడు ఉన్నారు విషయం తెలుసుకున్న స్థానిక యంపిటిసి బుసప్ప . మంజునాథ.పోలేపల్లి మాజీ యంపిటిసి.లోకేష్ పలువురు నాయకులు కార్యకర్తలు పల్గొని మృతునికి పూల మాల వేసి నివాళులు అర్పించారు

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందించిన సర్పంచ్

**బ్రహ్మసముద్రం ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**



విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

మండలం లోని గుండిగానపల్లి హైస్కూల్లో సరస్వతి పూజ సందర్భంగా పదవ తరగతి చదువుతున్న పిల్లలకు పరీక్ష సమయంలో ఉపయోగపడే మెటీరియల్ స్టూడెంట్సుకు 1.ప్యాడ్. జామెట్రీ బాక్స్ .రెండు పెన్నులు బహుమతిగా భైరవాణి తిప్ప సర్పంచ్ శెట్టి గారి మంజునాథ మెటీరియల్ను అందించారు పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్ లేక ప్రైవేట్ టీచర్గా పనిచేస్తున్న ఇంగ్లీష్ టీచర్ కి ఒక నెల జీతం 12వేల రూపాయలు అందించిన బైరావణితిప్ప సర్పంచ్ పోలేపల్లి శెట్టి గారి మంజునాథ్ మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు

# ఉచిత కంటి పరీక్షలు

**డి. హిరేహాళ్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని శివలింగస్వామి మఠం ఆవరణలో మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెదేపా నాయకుడు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్ళిరాజు చెప్పారు. ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో కంటిపరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ ఉచిత ఆంటి పరీక్షల్లో శస్త్రచికిత్సలు అవసరమైన వారికి బుధవారం బళ్లారిసమీపంలోని ఎల్విప్రసాద్ కంటి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకోదలచిన వారు ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని శివలింగ తాత మఠం ఆవరణకు చేరుకోవాలని ఆయన చెప్పారు.

# వాణిజ్య సముదాయ గదుల వేలం నిర్వహణ

**రాయదుర్గం ఫిబ్రవరి 24( ప్రభాతవార్త )**

పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వాణిజ్య సముదాయ గదుల వేలంపాట నిర్వహించారు ఎంపీడీవో కొండన్న ఆధ్వర్యంలో సోమవారం జడ్పి సీఈవో ఆదేశాల మేరకు వేలంపాట నిర్వహించారు ఈ వేలం పాటలో ఒకటవ రూమ్ 5200 రెండవ రూమ్ 5300 గౌని ప్రతాప్ రెడ్డి వేలంపాట దక్కించుకోగా మూడవ గదిని వెంకటేష్ నాయక్ 6000 నాలుగో రూమ్ రాఘవేంద్ర 7600 రూపాయలతో ఐదవ వరం నరేష్ కుమార్ రెడ్డి 7000 రూపాయలతో ఆరవరం దాదా పీర్ 5100 రూపాయలతో ఏడవ రూమ్ వెంకటేష్ నాయక్ 5300తో 8 వ రూమ్ సోమశేఖర్ 5100తో రూపాయలతో వేలంపాటి సొంతం చేసుకున్నారు గదులు సొంతం చేసుకున్న గుత్తేదారులు వారం రోజుల లోపల ఒక లక్ష ఇరవై వేల రూపాయలు చెల్లించి అగ్రిమెంట్ చేయించుకోవాలన్నారు ప్రతినెల 5000 రూపాయలు అది చెల్లించవదంగా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పిఓపిఆర్డి మురళీకృష్ణ సీనియర్ అసిస్టెంట్ ఆజాద్ రవి జూనియర్ అసిస్టెంట్ మహేష్ వేలంపాటిదారులు తదితరులు పాల్గొన్నారు అయితే అధికారులు నాయకులు ముందే కమిట్మెంట్తో వేలంపాటలో వేరేవాడు పాల్గొనకుండా లోలోన ధరలు కుదుర్చుకున్నట్లు ఆరోపిస్తున్నారు

# మొక్కజొన్న పంటకు నిప్పు

**కంబదూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

కంబదూరు మండలం ఎర్రబండ గ్రామానికి చెందిన కిష్టప్ప అనే రైతుకు సంబంధించిన మొక్కజొన్న పంటకు గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం నిప్పంటించారు. రైతు మాట్లాడుతూ తనకున్న 3 ఎకరాల పొలంలో మొక్కజొన్న పంట సాగు చేసానని అయితే గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పంట పూర్తిగా కాలి బూడిదైందని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనతో రూ.2.50 లక్షలు నష్టం వాటిల్లందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతు కోరారు.

మంటల్లో కాలిపోతున్న మొక్కజొన్న పంట



# భక్తుల భద్రతకు గట్టి బందోబస్తు

**డి. హిరేహాళ్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



శివరాత్రి సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐ వెంకటరమణ

శివరాత్రి వేడుకలను పురస్కరించుకొని గవిసిద్దేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ఘటనలు చోటు చేసుకోకుండ భద్రత పరమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాయదుర్గం గ్రామీణ సిఐ వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం ఆయన డి.హిరేహాళ్ ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డి సిబ్బందితో కలిసి మండలంలోని హెచ్.సిద్ధాపురం సమీపంలో వెలిసిన గవిసిద్దేశ్వర స్వామి ఆలయం వద్ద ముందు జాగ్రత్తగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటను పరిశీలించినట్లు ఆయన చెప్పారు. అడవి ప్రాంతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి స్వామి వారి ఆలయం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు విషయమై ఎస్ఐతో చర్చించి భక్తుల వాహనాలు ఆపేందుకు పార్కింగ్ ప్రదేశాలను, బారికేడ్స్ లాంటి ఏర్పాట్లు పగడ్బందీగా చేపట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు. సీఐ హెచ్ సిద్దాపురం నుండి గవిసిద్దేశ్వర స్వామి ఆలయం వరకు పర్యటించి ఏర్పాట్లను పరిశీలించి ఆలయ అర్చకులు,గ్రామ పెద్దలు, యువకులతో చర్చించి శివరాత్రి రోజు స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తులకు సౌకర్యాలు కల్పించి బందోబస్తు విషయంలో పోలీసులకు సహకరించి భక్తులకు ఏవైనా అసౌకర్యాలు కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన వారికి తెలిపారు.

# గురుకుల పాఠశాలకు వాటర్ ప్లాంట్ వితరణ

**కంబదూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



వాటర్ ప్లాంట్ను ప్రారంభిస్తున్న దృశ్యం

కంబదూరు మండలం తిమ్మాపురం లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలకు మినరల్ వాటర్ ప్లాంట్ ను దాత సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఎం వి. రావు వితరణ గా అందజేశారు. ఇందులో భాగంగా వెయ్యి లీటర్ల సామర్థం గల మినరల్ వాటర్ ప్లాంట్ ను ఉచితంగా సొంత విధులతో ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సోమవారం దాత ఆదేశాలతో గగన్ మహల్ అధ్యక్షుడు శ్రీ ప్రతాప్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మితో కలిసి వాటర్ ఫాంట్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ముఖ్య అతిథి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ తో పాఠశాలలో ఉన్న 677 మంది విద్యార్థులకు మంచి జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఎందరో మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన ఎం వి రావు కు విద్యార్థులు, సిబ్బంది తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రతాప్ రెడ్డి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి నుండి జనసేనలోకి చేరికలు

**చిలమత్తూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**



కండువావేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

జనసేన పార్టీ హిందూపురం నియోజకవర్గం ఇన్చార్జ్ ఆకుల ఉమేష్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ సిద్ధాంతాలు ఆశయాలు నచ్చి చిలమత్తూరు మండలానికి చెందిన శెట్టిపల్లి గ్రామ పంచాయతీలోని వైసిపికి చెందిన పలువురు యువకులు, కోడూరు పంచాయతీ కనిశెట్టిపల్లి, వడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన శెట్టిపల్లి ఇ.వెంకటేష్, సురేంద్రరెడ్డి, అంజనరెడ్డి, బాలు, మహేష్, అశోక్రెడ్డి, జి.సురేష్, సందీప్, కె.వడ్డిపల్లి ఎం.చంద్రశేఖర్, అనిల్కుమార్, కనిశెట్టిపల్లి కె.చంద్ర, పోతులప్పపల్లి నుండి సిజి నారాయణస్వామిలు జనసేన పార్టీలో చేరారు. వీరికి స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎవి రమణ, మండల కన్వీనర్ చిన్నాప్రవీణ్, జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ అగ్గి శ్రీనివాసులు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు వెంకటశివ, మండల నాయకులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణమూర్తి, మనోహర్, కృష్ణమూర్తి, జగదీష్, శెట్టిపల్లి రామాంజనేయులు, మంజు, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుందాం

## -ఉత్సవాలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

## -శాంతి సంఘ సమావేశంలో డిఎస్పి మహేష్

**లేపాక్షి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎస్పి మహేష్

మండల కేంద్ర మైన లేపాక్షిలో ఈ నెల 25 నుండి నిర్వహించనున్న శివరాత్రి బ్రహ్మో త్సవాలను సహృ ద్భావ వాతావర ణంలో జరుపుకుందామని శాంతి సంఘ సమావేశం లో డిఎస్పి మహేష్ సూచించారు. సోమవారం స్థానిక ఆర్జెహెచ్ ఫంక్షన్హాల్లో నిర్వహించిన శాంతి సమావేశంలో డిఎస్పి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా లేపాక్షి ఉత్సవాల్లో పాల్గొనాలని శాంతి సంఘ సమావేశంలో నాయకులకు పిలుపునిచ్చారు. అతి ప్రాచీనమైన లేపాక్షి ఉత్సవాలకు ఎవరైనా ఆటంకం కలిగించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. కుల మతాలకు అతీతంగా ఉత్సవాలు నిర్వహించే బాధ్యత మనందరిపై వుందన్నారు. సోదర భావంతో ఉత్సవాలను జరుపుకుందామని డిఎస్పి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ జనార్ధన్, ఎస్ఐలు నరేంద్ర, మునీర్అహ్మద్, మండల ఉపాధ్యక్షులు అంజనరెడ్డి, లేపాక్షి ఆలయ చైర్మన్ రామానందన్, అన్ని మతాలకు చెందిన పెద్దలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మెట్టును కలిసిన రైతు విభాగ సెక్రెటరీ రాజగోపాల్ రెడ్డి

**కనేకల్లు ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

రాయదుర్గం వైఎస్ఆర్సిపి సమన్వయ కర్త మెట్టు గోవింద్ రెడ్డి నీ వైసిపి రైతు విభాగ సెక్రెటరీ రాజగోపాల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. కనేకల్ మండలం వైఎస్ఆర్సిపి నాయకులు రాష్ట్ర రైతు విభాగ సెక్రెటరీ ఆలేరు రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్రస్థాయికి ఎన్నుకున్నందుకు జగన్మోహన్రెడ్డికి జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు అనంత వెంకటరామ్ రెడ్డి కి మెట్టు గోవింద్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసినారు .కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు మారంపల్లి మారెన్న కనేకల్ మండలం వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ పాటిల్.బ్రహ్మానందరెడ్డి. ఆది సద్గురు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# శివరాత్రి ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహిస్తాం

## -పర్యాటకులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు

## -ఎమ్మెల్యే బాలయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలు

**లేపాక్షి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ రామానందన్

ప్రపంచ ప్రసిద్ధి చెందిన లేపాక్షి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను అంగరంగవైభంగా నిర్వహిస్తామని లేపాక్షి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కరణం రామానందన్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 25వతేదీ సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమంతో లేపాక్షి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 26న దుర్గ వీరభద్రస్వాములకు ప్రత్యేక పుష్పాలంకరణతో పాటు వేద పండితుల ఆధ్వర్యంలో హోమాలు అభిషేకాలు అర్చనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శివరాత్రి జాగరణ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తి గీతాల ఆలాపన జరుగుతుందన్నారు. పాపనాశేశ్వరస్వామికి 4 యామ పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 27న శివపార్వతుల బ్రహ్మరథోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బ్రహ్మ రథోత్సవం రోజున మధ్యాహ్నం 12 గంటలకు భక్తులందరూ ఆలయానికి రావాలన్నారు. నియమిత సమయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్నదానం, నీరు, మజ్జిగ పంపిణీకి దాతలు ముందుకు రావాలన్నారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వాలంటరీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు దర్శన భాగ్యానికి ప్రత్యేక తూర్పు ద్వారం నుండి ప్రత్యేక వసతులు కల్పించడం జరిగిందన్నారు. యాత్రికులకు ఇబ్బంది కలగకుండా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పెద్దఎత్తున భద్రత బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది రథోత్సవం ప్రత్యేక పుష్పాలంకరణతో దర్శనమిస్తుందన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు, గ్రామస్తులు ప్రతి ఒక్కరూ పాల్గొని శివరాత్రి ఉత్సవాలను దిగ్విజయం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆలయ ఇఒ నరసింహమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహశర్మ పాల్గొన్నారు.

# లేపాక్షి దేవాలయాన్ని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్

**లేపాక్షి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సజ్జనార్ దంపతులు

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి శ్రీదుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి దేవాలయాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ సతీసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా దుర్గ, పాపనాశేశ్వర, వీరభద్రస్వామికి ఆలయ అర్చకులు శ్రీనివాసమూర్తి, నరసింహశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వీరభద్ర అన్నప్రసాదం సేవా ట్రస్ట్ను సందర్శించి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీఅన్నపూర్ణేశ్వరిదేవి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన రైతులు



ఫిర్యాదు చేస్తున్న రైతన్నలు

**బెలుగుప్ప, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

మండల పరిధిలో అంకంపల్లి, ఉద్దేకుంట, సీర్పి కొట్టాల, నక్కలపల్లి గ్రామ రైతులు మూడు సంవత్సరాల నుంచి పప్పుశనగను బెలుగుప్ప గ్రామానికి చెందిన విక్రం సన్/ఆఫ్ ప్రభాకర్ అనే వ్యాపారస్తునికి పట్టించే వారు. ఆరు నెలల నుంచి వాయిదాలు వేస్తూ రైతులు ఫోన్లు చేసినా రిప్లై ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. మండలంలో శివ్సాయి వేర్ మిల్లో నిల్వ ఉంచారు. ఆ పప్పుశనగలను ఆ వ్యాపారస్తులు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఇప్పుడు రైతులు మా పంటకు సంబంధించిన నగదు కావాలని అడిగిన సరైన సమాధానం చెప్పకపోవడంతో సోమవారం ఫజ్యాదు చేశారు. అందులో భాగంగా శివ్సాయి వేర్ మిల్లో 4వ భాగం అతని షేర్ ఉంది. అదికూడా మిగిలిన ఇద్దరికి అమ్మేశారని రైతులు తెలుసుకున్నారు. వెంటనే మాకు రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి వెంటనే అతనిని పిలిపించి మాకు న్యాయం చేయాలని రైతులు సబ్ ఇన్సపెక్టర్ శివను విన్నవించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎరిస్వామి, రమేష్, భీమలింగప్ప, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

# యువకునిపై ఫోక్సో చట్టం నమోదు

**బెలుగుప్ప, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

మండల పరిధిలో ఒక మైనర్ బాలికను రాత్బ్యాంక్ తండాకు చెందిన యువకుడు కళ్యాణదుర్గంలో చదువుతున్న బాలిక శనివారం సాయంత్రం నుంచి కనపడక పోవడంతో వెంటనే తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. సోమవారం రోజు యువకుడు మైనర్ బాలిక పోలీస్ స్టేషన్లో హాజరు పర్చగా రాత్బ్యాంక్కు చెందిన యువకునిపై ఫోక్సో చట్టంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

# యువ నాయకుడు యస్వంత్ జన్మదిన సందర్బంగ మెగా వైద్య శిబిరం

**కళ్యాణదుర్గం టౌన్ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం పట్టణంలోని శాసన సభ్యులు శ్రీ అమిలినేని సురేంద్ర బాబు తనయుడు అమిలినేని యస్వంత్ జన్మదినం సందర్భంగా కళ్యాణదుర్గంలో సోమవారం రోజున ప్రజావేదిక వద్ద మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. కర్నూల్ అస్పత్రి శ్రీ చక్ర వారు ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. గుండె చికిత్స 2డీ కంటి పరీక్షలు చెకింగ్ కిడ్నీ, బిపి, షుగర్ నిర్వహిస్తున్నారు. ప్రజలు ఉపయోగకరంగా ఉందని. సగటున ఆ పరీక్షలన్ని చేయించాలంటే 2 వేలకు పైగా ఖర్చులు అవుతాయని స్థానికంగా ఏర్పాటు చేసుకోవడం సంతోషదాయాకమని ప్రజలు హర్షం వ్యక్తం చేసారు.



రోగులకు గుండె పరీక్షలు చేస్తున్న దృశ్యం

# రీసెర్వే పనులపై పై క్షేత్రస్థాయిలో పర్యటించండి

## జిల్లా కలెక్టర్ టీ.ఎస్.చేతన్



వీడియో కాన్ఫరెన్సో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టీ.ఎస్.చేతన్

**పుట్టపర్తి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**

శ్రీ సత్య సాయి జిల్లాలోని ఆయా రెవెన్యూ డివిజన్ ల పరిధిలోని రీసర్వే పనులపై సంబంధిత ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని జిల్లా కలెక్టర్ టీఎస్.చేతన్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలునుండి ఫ్రీహోల్డ్, హౌస్సైట్, రెవెన్యూ సర్వీసెస్, పిజిఆర్ఎస్, రీసర్వే, రైతులగుర్తింపుకార్డు జనరేషన్, ఇతరఅంశాలపై, సంబంధించిన సంబంధిత ఆర్డీవోలు, తహశీల్దార్లతో, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్లో వచ్చిన వినతులను పరిష్కారం నిబంధనలను అనుకూలంగా నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆంధ్ర ప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులకు గుర్తింపు సంఖ్య జారీ కార్యక్రమం గురించి సమీక్ష చేశారు. గ్రామ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారుల యొక్క లాగిన్లలో వున్న ఒక లక్షా ఒక వెయ్యి రికార్డులను ఈనెల 28 లోగా ధృవీకరించాలని ఆదేశించారు. అలాగే ఫ్రీ హోల్డ్ సంబంధించిన అంశాలను ఈనెల 28 తేదీ లోపల పూర్తిచేయాలని ఆర్డిఓ లను ఆదేశించారు. ఎం ఎస్ ఎం ఈ సర్వే పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు, నలుగురు ఆర్డీవోలు కష్టపడి పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి యువ నాయకుడు యశ్వంత్ జన్మదిన వేడుకలు



టిడిపి సీనియర్ నాయకులు అభిమానుల మధ్య కేక్ కట్ చేసిన యువ నాయకుడు యశ్వంత్

**కళ్యాణదుర్గం టౌన్ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం పట్టణంలోని శాసన సభ్యులు అమిలినేని సురేంద్ర బాబు తనయుడు అమిలినేని యస్వంత్ జన్మదిన వేడుకలు ప్రజావేదికలో సోమవారం రోజున ఘనంగా జరిగాయి. మొదట అయన నేరుగా బెంగళూరు నుండి అక్కమాంబ ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ కమిటీ చైర్మెన్ రాము యస్వంత్ నీ సన్మానించారు.అక్కడ టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం పాల్గొని భక్తులకు అన్నదానం చేసారు. భక్తుల నడమే అయన భోజనం చేసారు. అనంతరం ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ టిడిపి కుటుంబ సభ్యులు బాణా సంచా కాల్చి స్వాగతం పలికారు.అక్కడ ఉన్నవారందరు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అనంతరం వారందరి నడుమ కేక్ కట్ చేసారు. మరియు ఏర్పాటు చేసిన వైద్యశిబిరం పరిశీలించి వైద్యులతో మాట్లాడిన అనంతరం ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గం లోని టిడిపి నాయకులు కార్యకర్తలు జన్మదిన వేడుకలు ఘనంగా ఏర్పాటు చేసిన నాయకులు కార్యకర్తలు ప్రజలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# జిల్లా పోలీస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 58 పిటీషన్లు

**పుట్టపర్తి (కల్చరల్), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త**



ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

సత్య సాయి జిల్లా పోలీస్ కార్యాలయం నందు సోమవారం జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాలతో పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలమూలల నుండీ విచ్చేసిన ప్రజల నుండీ 58 పిటీషన్లు డీఎస్పీ స్వీకరించి అర్జీలను పరిశీలించారు. భార్యా భర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, ఆన్లైన్ మోసాలు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్, తో పాటు ఎస్బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి సిబ్బంది ఉన్నారు.

# అధికారులు ఎక్కువ..సమస్యలు తక్కువ..!

## -పీజీఆర్ఎస్లో పనిచేయని వీడియో కాన్ఫరెన్స్ సిస్టం

**ఉరవకొండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త**

అధికారులు ఎక్కువ..సమస్యలు తక్కువ అన్నట్టు కొనసాగింది పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం. ఇదివరకు పీజీఆర్ఎస్ కొన్ని శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరవుతూ వస్తుండగా అధికారులు తీసుకున్న నిర్ణయాలతో గత రెండు వారాలుగా దాదాపు అన్ని శాఖల అధికారులు హాజరవుతున్నారు. అయితే పీజీఆర్ఎస్లో ప్రజలనుండి రెండు,మూడు సమస్యలుమాత్రమే అధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. కాగా పీజీఆర్ఎస్లోని వీడియోకాన్ఫరెన్స్ సిస్టం పనిచేయకపోవ దం విశేషం. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్బాషా, ఎంపీడీఓ రవికుమార్, ఏవో శుభకర్, ఎంఈవోలు ఈశ్వరప్ప, రమాదేవి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య, మండల ఇంజనీర్ రవీంద్ర, పశు వైద్యురాలు శ్రీవిద్య, ఏపీఓ విమల, హౌసింగ్ ఏఈ అశ్వర్ధనారాయణ, ఐసీడీఎస్ సూపర్వైజర్ రాజమ్మ, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ జయప్రకాష్గౌడ్, ఆర్అండ్బీ తదితర శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.



మండల తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు

# సాగునీటిపై మాప్రతిపాదనలకు సీఎం స్పందించాలి

## ఇప్పటికే మంత్రి నిమ్మల రామానాయుడు డిస్ట్రిక్ట్ తీసుకెళ్లాం - మేము పోలవరం వైకుంటపురం సోమశిల పథకానికి అనుకూలం టీ .లక్ష్మీనారాయణ వెల్లడి

అనంతపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాగునీటిపరంగా సత్వరమే కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేందుకు కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చా మని, సీఎం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ పి లక్ష్మీనారాయణ అభిప్రాయ పడ్డారు.. గతంలో మంత్రి నిమ్మల రామానాయుడుని కలిసి కొన్ని ప్రతిపాదనను ఆయన దృష్టికి తీసుకెళ్లిన వాటిని పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం ముందుకెళ్లడం శోచనీయమన్నారు.కృష్ణా నదీ జలాల సమస్య పెండింగ్ ప్రాజెక్టుల సత్వర నిర్మాణం, కె.ఆర్.యు.బి. కార్యాలయం ఏర్పాటు, ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పోలవరం బనకచర్ల ఎత్తిపోతల పథకం అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి మా అభిప్రాయాలను తీసుకెళ్లడమే మా కర్తవ్యం గా ఎదురు చూస్తున్నాం అన్నా రు.. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేసి చూడాల న్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై పునరాలోచి ంచుకుంటే సముచితంగా ఉంటుంది అన్నారు. మేం గోదావరి కృష్ణా పెన్నా (పోలవరం వైకుంఠాపురం సోమశిల) అనుసంధాన పథకానికి అనుకూలం అని టి .లక్ష్మీనారాయణ తెలియజేశారు. అమరావతి రాజధాని అత్యాధునిక నగరంగాను, పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టు 45.72 మీటర్ల ఎత్తుతో సత్వరం నిర్మించి గరిష్ట స్థాయిలో నీటిని నిలబెట్టాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సమతుల్యతతో, సమగ్రాభివృద్ధి చెందాలని బలంగా ఆకాంక్షిస్తున్నాం అని చెప్పారు. "నేను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు" అన్న నానుడిగా వ్యవహరిస్తే సమస్యలు కొని తెచ్చుకుంటారు అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రైతు సేవా సంస్థ, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక, రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న విజయవాడలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించిన నాలుగు తీర్మానాలను అదే రోజు ప్రతినిధివర్గంగా వెళ్ళి రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుకు అందజేసి గతంలో వివరించాం. ఈ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మా ప్రతినిధి బృందంతో సమావేశం ఏర్పాటు చేయించమని విజ్ఞప్తి చేశాం. ఇ మెయిల్స్ , స్పీడ్ పోస్టు ద్వారా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, కొందరు మంత్రులకు తీర్మానాలను పంపినట్లు ఆయన తెలియజేశారు.మనది ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన ప్రభుత్వం. రైతు సంఘాలు , రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక ఉద్యమ కారులు, సాగునీటి రంగానికి చెందిన పలువురు విశ్రాంత ఇంజనీర్లు, తదితరులు లోతుగా తర్జన భర్జన చేసిన మీద ట సభ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాలను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ఆ మరుసటి రోజే రెండు అంశాలపై ప్రతికూల నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం అత్యంత గర్హనీయం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి




ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభలో మాట్లాడుతున్న టి .లక్ష్మీనారాయణ (ఫైల్ ఫోటో)

అధ్యయన వేదిక కన్వీనర్ టి లక్ష్మీనారాయణ వెల్లడించారు. వాటిలో ఒకటి, కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలుకు తరలించాలనే విజ్ఞప్తిని పెడచెవిన పెట్టి విజయవాడకు బోర్డు కార్యాలయాన్ని తరలించమని సిఫార్సు చేస్తూ కృష్ణా నది యాజమాన్య బోర్డు ఛైర్మన్ కు ప్రభుత్వం ఉత్తరం వ్రాసింది. రెండవది, పోలవరం బనకచర్ల పథకంపై పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేస్తే, దానిపై కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడానికి నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యం కలిగించింది. ఈ నేపథ్యంలో మరొకసారి ముఖ్యమంత్రి దృష్టికి విజయవాడ సభ చేసిన తీర్మానాలను తీసుకువెళ్లడం సముచితమని భావిస్తున్నట్లు ఆయన తెలిపా రు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22వ తేదీన కడపలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించిన "ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభ" జరిగింది అన్నారు. ఆ జిల్లాల నుండే కాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ప్రతినిధులు పాల్గొనట్లు ఆయన చెప్పారు. ఆ మహాసభకు అతిథిగా టీడీపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ శ్రీనివాసరెడ్డి వచ్చారని, మా ప్రతిపాదనలకు సంబంధించి రెండు చిరుపుస్తకాలను శ్రీనివాస్ రెడ్డికి ఇచ్చామని, వీటిని తీసుకెళ్ళి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మా తరుపున అందజేయమని విజ్ఞప్తి చేస్తూ, వాటిని వేదికపైనే, మీడియా సమక్షంలో అందజేసినట్లు ఆయన వివరించారు..వాటిలో ఒకటి, విజయవాడ సభలో ఆమోదించిన నాలుగు తీర్మానాలను ఆ సభకు అధ్యక్షత వహించిన శ్రీ భవానీ ప్రసాద్ గారు "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగునీటి రంగంలో అత్యవసరంగా చేపట్టాల్సి న అంశాలు" అన్న శీర్షికతో చిరుపుస్తకంగా అచ్చువేయించారు. ఆ పుస్తకంతో పాటు బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ నేపథ్యంలో నేను "కృష్ణా జలాల హక్కుల పరిరక్షణ కొత్త ప్రభుత్వం ముందున్న పెనుసవాల్!" శీర్షికతో ప్రచురించిన చిరుపుస్తకాన్ని, రెండింటినీ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారికి అందజేయమని శ్రీ శ్రీనివాసరెడ్డిగారిని కోరాము.

# గవిసిద్దేశ్వరుడుని దర్శించుకోద్దాం రండి



గవిలో వెలిసిన గవి సిద్దేశ్వర స్వామి



శివాలయం ఆవరణలో ప్రతిష్టిం చిన 108 లింగాలు



ఆలయం ముందు భాగంలో విరాజిల్లుతున్న కొలను

డి. హిరేహాళ్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల దర్శనంకు ముస్తాబ వుతున్న గవి సిద్దేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు సిద్ధం చేసింది దర్శించుకొద్దాం రండి. డి. హిరేహాళ్ మండలం హెచ్. సిద్దాపురం, హెచ్ ఎస్ తాండా గ్రామాల సమీపంలో ఇనుప కొండల మధ్యన ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో ప్రకృతి సౌందర్యం పచ్చదనంతో నిండిన ఆహ్లాదాన్ని పరుచుకున్న గుహలో వెలిసి పూజలందుకుంటున్న గవిసిద్దేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలకు ఆలయ ధర్మకర్త హెచ్ జి రాములు ఆధ్వర్యంలో శోభాయ వారా అలంకరణ లతో ఆ స్వామివారి ఆలయాన్ని సిద్ధం చేశారు. స్వామివారి శివలింగం గవిలో వెలిసిందని అందుకే గవిసిద్దేశ్వరుడన్న నామంతో తరతరా లుగా పిలవబడుతున్నట్లు పురాణ గాథల్లో వివరించబ డిందని సరిహద్దులోని ఆంధ్ర కర్ణాటక ప్రాంత ప్రజలు చెబుతున్నారు. స్వామివారి ఆలయం ఆవరణలో భక్తుల దర్శనార్థం108 లింగాల ప్రతిష్టాపన, ముందు భాగంలో దట్టమైన అడవి ప్రాంతం, ఇనుప కొండల మధ్య నుండి దారుల ప్రవహి స్తున్న జలంతో కూడిన సుందరంగా విరాజు ల్లుతు న్న నీటి కొలన భక్తులను ఆక ట్టుకుం టుంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఈ కొలన నీటిని తలపై వేసుకొని అనంతరం స్వామివారి దర్శనానికి వెళ్లి ఆనవాయితీ ఇక్కడ కొనసాగుతోంది. స్వామివారిని దర్శించు కునేందుకు ఆంధ్ర కర్ణాటక లోని సుదూర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకుంటారు. భక్తితో స్వామివారిని పూజించే భక్తుల కోర్కెలు తీ ే ం చ కొంగుబంగారం గవి సిద్దేశ్వర స్వామి అని స్వామివారిని దర్శించు కున్న భక్తులతో పాటు ఇక్కడి సమీప గ్రామాల ప్రజలు చెబుతున్నారు. "స్వామి వారి ఆలయం కు ఎలా వెళ్లాలి" గవిలో వెలిసిన గవిసిద్దేశ్వర స్వామి ఆలయం డి. హిరేహాళ్ మండల కేంద్రం కు 10 కిలో మీటర్ల దూరంలో ఉంది. కర్ణా టక రాష్ట్రం బళ్ళారి పట్టణంకు 28 కిలోమీటర్ల దూరంలో ఉంది. స్వామి వారిని దర్శించుకునేందుకు వెళ్లాలంటే డి.హిరేహాళ్ మండల కేంద్రం చేరుకొని అక్కడినుండి హెచ్. సిద్దాపురం మీదుగా అటవీ ప్రాంతం గుండ స్వామివారి దేవాలయం చేరుకోవాల్సి ఉంటుంది. మండల కేంద్రం నుండి ఆటోల్లో చేరుకొని స్వామివారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. " శివరాత్రి ప్రత్యేకత "ఆంధ్ర కర్ణాటక ప్రాంతాల నుండి శివరాత్రి వేడుకల్లో స్వామివారి ఆలయానికి చేరుకున్న భక్తులు ఉపవాసంతో పూజల్లో పాల్గొని శివనామస్మరణంతో రాత్రి ఆలయ ప్రాంగణంలో భజనలు చేస్తారు. మరుసటి రోజు ఉదయం స్వామి వారికి అర్చకులు బస్మాభిషేకం పూజలు నిర్వహిస్తారు. స్వామివారి బస్మాబి. షేకం కు కావలసిన విభూదిని కర్ణాటక లోని విభూది గుడ్డ నుండి విభూది తెచ్చి స్వామి వారిని అలంకరిస్తారు. భక్తులు స్వామివారి బస్మాభిషేకం పూజల్లో పాల్గొని మహా మంగళహారతి అనంతరం అర్చకులు అందించే తీర్థ, ప్రసాదాలు అందుకొని స్వామివారికి మొక్కులు తీర్చుకొని ఇక్కడ ఆనవాయి తీగా వస్తోంది. శివరాత్రి వేడుకలను పురస్కరించుకొని డి. హిరేహాళ్ ఎస్ ఐ గురు ప్రసాద్ రెడ్డి హెచ్ సిద్దాపురంతో పాటు అటవీ ప్రాంతం లో స్వామి వారి ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 59 పిటిషన్లు

## - జిల్లా ఎస్పి జగదీష్ ఆదేశాలతో పిటిషన్లను స్వీకరించిన అదనపు ఎస్పి

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుండి 59 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా ఎస్పి జగదీష్ ఆదేశాలతో అదనపు ఎస్పి డివి రమణమూర్తి ప్రజల నుండి పిటిషన్లను స్వీకరించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన నాణ్యతగా పరిష్కారం చూపాలనే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు స్వేచ్ఛగా పిటిషన్లు అందచేశారు. అదనపు ఎస్పి పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్ట పర ంగా చర్యలు తీసుకునేలా ఆదేశా లు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదు ల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వా లని సూచించారు. భార్యా భర్తల గొడవలు, కుటుంబ సమ స్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి.




అర్జీలను స్వీకరిస్తున్న అదనపు ఎస్పి

# 11 స్థానాలు వచ్చినా జగన్ తీరులో మార్పు రాలేదు

## - అనర్హత నుంచి తప్పించుకునేందుకు జగన్ అసెంబ్లీకి వచ్చారు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతోనూ, స్వార్థ పూరిత పాలన సాగించిన జగన్‌రెడ్డిని 11 స్థానాలకే పరిమితం చేశారని, అయినా ఆయన తీరుపై మార్పు రాలేదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. వైఎస్‌ఆర్‌సిపికి చెందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీని బాయ్‌కాట్ చేసిన అంశంపై ఆయన తీవ్రంగా స్పందించారు. జగన్‌ని నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ఆయన ఏం చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. మంచి చేస్తున్న తెలుగుదేశం ప్రభుత్వంపై నిత్యం విమర్శలు చేస్తూ ఏదో ఒక అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆయనకు ప్రజలన్నా, ప్రజాస్వామ్యం అన్నా, ఎన్నికల కమిషన్ నిబంధనలన్నా లెక్కలేద న్నారు. ప్రజలు వైసిపికి ప్రతిపక్ష హోదా లేకుండా చేసినా కూడా ఆయనకు బుద్ధి రాలేదన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలని గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగలడం ఏంటని నిలదీశారు. అసెంబ్లీలో వైసిపి ఎమ్మెల్యేల వ్యవహారశైలి వారి దిగజారుడుతనానికి నిదర్శనంగా కనిపించిందన్నారు. ఎవరైనా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పోరాడటం చూస్తుంటాం కానీ, ప్రతిపక్ష హోదా కోసం పోరాడే వారిని ఇప్పుడే చూశామన్నారు. జగన్ సహా వైసిపి ఎమ్మెల్యేలకు ప్రజల సమస్యలపై భాధ్యత లేదన్నారు. ప్రజా సమస్యల కన్నా జగన్‌కు అసెంబ్లీలో ప్రతిపక్ష హోదానే ముఖ్యమా..? అం టూ నిలదీశారు. ప్రతి పక్ష హోదా ఒకరిస్తే వస్తుందా అంటూ ప్రశ్నించారు. సభ్యత్వా లు రద్దవుతాయని హాజరు కోసం అసెంబ్లీకి వచ్చినట్టు ఉందని కామెంట్ చేశారు. వారికి ఎమ్మెల్యేలు ఉండటం ఇష్టం లేకపోతే రాజీనామా చేయాల న్నారు. ప్రజల పట్ల వారికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా అసెంబ్లీలో ఉండేవారిని ఎమ్మె ల్యే దగ్గుపాటి ప్రసాద్ వ్యాఖ్యా నించారు.



: మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

# ప్రజా సమస్యల పరిష్కారవేదిక అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలి

## - జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహి ంచిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు ప్రజల నుండి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, డిప్యూటి కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, ఆనంద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి 502 అర్జీలను జాయింట్ కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్ అర్జీలను గడువులోపు పరిష్కరిం చాలని, ఎలాంటి పెండింగ్ ఉంచరాదన్నారు. జిల్లా అధికారులంతా జవాబు దారీతనంతో అర్జీల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం వుండరాదని, మళ్లీ రీఓపెన్ కాకుండా నాణ్యతగా అర్జీలను పరిషన్కరించాలని ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనం తరం భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆధ్వర్యంలో రూపొందించిన మీ ముఖ్య అవసరా లను సరిగ్గా గుర్తించండి. తెలివిగా నడుచుకోండి, ఆర్థిక క్రమశిక్షణ పాటిం చండి. బాధ్యతాయుతంగా అప్పు చేయి, సమయానికి చెల్లించు, మంచి క్రెడిట్ స్కోర్ కొనసాగించు, మీ నెలసరి బడ్జెట్‌ను ప్లాన్ చేసుకుని పొదుపు చేయండి అనే పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.రామచంద్రరెడ్డి, సిపిఒ అశోక్‌కుమార్, డిఆర్‌డిఏ పిడి ఈశ్వరయ్య, హౌసింగ్ పిడి శైలజ, జిల్లా సైనిక్ సంక్షేమశాఖ అధికారి పి.తిమ్మప్ప, డిటిసి వీర్రాజు, పిఆర్ ఎస్ఇ జహీర్‌అస్లాం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఆర్టీసి ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని, హెచ్ఎల్‌సి ఎస్ఇ రాజశేఖర్, డిఎంహెచ్ఓ డాక్టర్ ఈబి.దేవి, ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, పశుసంవర్థకశాఖ జెడి వెంకటస్వామి, డిఇఒ ప్రసాద్‌బాబు. ఎల్‌డిఎం నర్సింగరావు, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూకొఠారి, కలెక్టరేట్ సూపరిం టెండెంట్లు వివిధశాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ



పోస్టర్లను విడుదల చేస్తున్న జాయింట్ కలెక్టర్

# సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దు

## జిల్లా కలెక్టరు టీఎస్ చేతన్

శ్రీ సత్యసాయి జిల్లా, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త ప్రతినిధి:

ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టరు టీఎస్ చేతన్ అన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా లోని కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 233 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, అభిషేక్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి,పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు మరింత వేగవంతం చేసే ఉద్దేశ్యంతో ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టా త్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. అర్జీల పరిష్కార ప్రక్రియ పెండింగ్ లేకుండా అధికారులు చూడాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి, క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారి వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాల న్నారు. జిల్లాలోని అన్ని శాఖలకు సంబంధించిన ఐ వి ఆర్ ఎస్ కాల్ ఫీడ్‌బ్యాక్‌లకు అందరూ హెచ్ ఓ డిలు బాధ్యత వహించాలని పేర్కొన్నారు. అందరూ హెచ్ ఓ డీలు మీ మండలంలోని పాఠశాలలను సందర్శించాలి. ఇటువంటి తనిఖీలు విద్యార్థులకు ప్రేరణను ఇస్తయాన్నారు. పాఠశాలల ర్యాండమైజేషన్ గురించి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ర్యాండమైజేషన్ పాఠశాల తనిఖీని పూర్తి చేసి, ఆ నివేదికను సమర్పించాలని, నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అందరూ మండల ప్రత్యేక అధికారులు మీ మండలాల్లో జి ఎస్ డబ్ల్యూ ఎస్ సర్వేలు, పి 4 సర్వేను పర్యవేక్షించా లని, ఎం ఎస్ ఎం సర్వే పురోగతిని కూడా పర్యవేక్షిం చాలితెలి పారు. అంతకు ము నుపు అనంతరం జిల్లా కలెక్టర్ కౌంటర్ నందు ఏర్పాట్లపై సంబంధిత అధికా రులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు, తాగునీరు ఏర్పాట్లను పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, పట్టు పరిశ్రమ శాఖ జెడి పద్మావతి, ఏపీఎంఐపి పిడి సుదర్శన్, సిపిఓ విజయ్ కుమార్, హౌసింగ్ పిడి వెంకటరమణారెడ్డి, ల్యాండ్ సర్వే ఏడి విజయశాంతి భాయ్, ఎల్ డి ఎం రమణ కుమార్, ఉద్యానవన శాఖ చంద్రశేఖర్, మత్స్యశాఖ చంద్రశేఖర్ రెడ్డి, డి సి హెచ్ ఓ తిపేంద్ర నాయక్, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రతినిధి, శివరంగ ప్రసాద్, హ్యాండ్లూమ్స్ మరియు టెక్స్టైల్స్ శాఖ అధికారి రామకృష్ణ ఆర్డబ్ల్యూఎస్ ఎస్సి ఈ మల్లికార్జునయ్య, జిల్లా క్రీడల శాఖ అధికారి ఉదయ్ కుమార్, జెడ్ ఎమ్ సహాని సోని, గ్రామ వార్డు సచివాలయం నోడల్ ఆఫీసర్, సుధాకర్ రెడ్డి, డి ఎం అండ్ హెచ్ ఓ, ఫిరోజ్ బేగం, ఐసిడిఎస్ పిడి ప్రతినిధి స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరి కిరణ్, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద ఎస్ సి పి ఆర్ మురళి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి సహదేవ, ఆర్ అండ్ బి ఎస్ సి ఈ సంజీవయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలను అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

# కేంద్ర రాష్ట్రాలు ప్రవేశపెడుతున్న పథకాలతో ఎంతో ప్రయోజనం

## అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 24 ప్రబాతవార్త

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వలు రైతులకొరకు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలవల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ అన్నారు.సోమవారం బుక్కరాయసముద్రం మండల పరిదిలోని రెడ్డిపల్లి కెవికె నందు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కిసాన్ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అథితులుగా హాజరైనారు.ఈ కార్యక్రమానికి వారితోపాటు అనంతపురం జిల్లా రైతులు వ్యవసాయ,ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీహార్‌లోని భాగల్పూర్‌లో 19వ పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్ కార్యక్రమంలో నిధులను విడుదలచేశారని గుర్తుచేశారు.దీంతో దాదాపు 9.26కోట్లమంది రైతుల ఖాతాల్లో రూ.2వేలు చొప్పున రూ.20వేల కోట్లు జమకానున్నాయి.అనంతరం ఎంపీ మాట్లడుతూ కేంద్రం సన్నకారు రైతులకు ఏడాదికి రూ 6వేలు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.9వేలు కలిపి మెత్తం కలిపి 15వేలు అందిస్తుం దన్నారు. 5ఎకరాలకంటే ఎ్కవ భూమి ఉన్న రైతులకు 10వేలు ఇస్తుందన్నారు.వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అందుబా టులో ఉండి కేంద్ర రాష్ట్ర ప్రభు త్వల పథకాల పై అవగాహన కల్పిస్తూ శాస్త్రవేత్తలు రైతులు పంటదిగుబడిలో మేలైన యాజమాన్య పద్దతుల పై వారికి సహాలు సూచనలు అందజేయా లన్నా రు ఈ కార్యక్రమ ంలో వారితో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు తదితిరులు పాల్గొన్నారు..




మాట్లడుతున్న ఎంపి అంబికా లక్ష్మినారాయణ

# శాసనసభ సమావేశాలకు వెళ్లిన మహిళా ఎమ్మెల్యేలు

అనంతపురం, ఫిబ్రవరి 24, ప్రభాత వార్త బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సమావేశాలు అమరా వతిలో సోమవారం ప్రారంభమయ్యాయి. శాంసంగ్ సమావేశాల్లో రాష్ట్ర గవర్నర్ ప్రత్యేకంగా ప్రసంగిం చారు.. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున శాసనసభ సమావేశాలకు హాజరయ్యారు.. ఈ సమావేశాల్లో మహిళా ఎమ్మెల్యేలు కూడా ఎక్కువమంది పాల్గొన్నారు. అనంతపురం జిల్లా నుంచి మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణి, పల్లె సింధూర రెడ్డి తదితరులు హాజరయ్యారు.. తోటి మహిళా ఎమ్మెల్యేలతో మహిళా ఎమ్మెల్యేలు ఆనందంగా గడిపారు.



అసెంబ్లీ ఆవరణంలో ఎంఎల్‌ఏలు పరిటాల సునీత, బండారు శ్రావణీశ్రీ



తోటి ఎంఎల్‌ఏలతో పరిటాల సునీత, బండారు శ్రావణీశ్రీ

# కలసి కట్టుగా పనిచేద్దాం పార్టీని బలోపేతం చేసుకుందాం

## మాజి మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్

ఫోటోరైటప్ బికెయస్ 1బుక్కరాయసముద్రం ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

వైస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు కలసి కట్టుగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసుకుందామని మాజి మంత్రి వైస్సార్సీపీ నేత డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు.సోమవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో సొసైటీ ఆవరణంలో వైస్సార్సీపీ కార్యకర్తలు, నాయకు లు,అభిమానులతో ఆయన మాట మంతి నిర్వహించారు. ముందుగా శైలజానాథ కు పుష్పగుచ్ఛం అందజేసి శాలవాలతో సన్మానించారు.అనంతరం ఆయన అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ పాట్టీ బలోపేత వంటి విషయాల పై చర్చించారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు సర్పంచు పార్వతి ,పూలనారాయణస్వామి,నందినేని మల్లి,పురుషోత్తం,కాల్వ నారాయణ స్వామి, చెదుళ్ళ సర్పంచు శ్రీనివాసురెడ్డి,పెద్దకొండయ్య, జంతులూరు రామ్మోహన్‌రెడ్డి, సత్తి,పూల ప్రసాద్,వడియంపేట అంజి,పెద్దన్న,నిమ్మల భాస్కర్,రోటరీపురం నాగ తోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వైస్సారీపీ నాయకులు కార్యకర్తలతో మాట్లడుతున్న మాజి మంత్రి శైలజానాథ్